క్లుప్తంగా

నివాళి



నివాళులు అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిన తల్లి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తల్లి కృష్ణమ్మ(85) హఠాన్మరణం చెందారు. ఆమె భౌతిక కాయానికి మంత్రి గురువారం నివాళులు అర్పించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎస్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ముత్తం శెట్టి విశ్వనాథ్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీలు సురేంద్రనాథ్‌రెడ్డి, ఎల్లప్ప, పలువురు నాయకులు ఉన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

సదుం: ఫిట్ ఇండియా క్విజ్ పోటీలో స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడని ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి గురువారం తెలిపారు. గత డిసెంబర్ 21, 22న ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలో 10వ తరగతి విద్యార్థి లీలాధర్ పాల్గొన్నాడని, గురువారం వెలువరించిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అతడు ప్రథమస్థానం సాధించినట్టు ఆయన చెప్పారు. విద్యార్థిని, గైడ్ టీచర్ ఆంజినేయులను పాఠశాల బృందం అభినందించింది.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించండి

బైరెడ్డిపల్లి: ఆశావర్కర్లు గ్రామాల్లో వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో గురువారం ఆశా డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరగనున్న దృష్ట్యా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, దీని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్టా డైరీ ఆవిష్కరణ



పలమనేరు: పట్టణంలోని ఎమ్మార్సీలో ఆప్టా(ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్) డైరీని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి మునాఫ్, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రొంపిచెర్ల: 15మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి మొత్తం రూ.29,570 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కృష్ణయ్య గురువారం తెలిపారు. ఆయన కథనం.. బండకిందపల్లె గ్రామ పంచాయతీ హనుమంతురాయుని పేటలోని వీధి దీపాల కింద పేకాట ఆడుతున్నారని రహస్య సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ 9 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.14.970 వేలు, అలాగే చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీ కోటకాడపల్లె దళితవాడలో సైతం దాడి చేసి మరో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.14.600 స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ను ఢీ కొన్న ట్రాక్టర్

చౌడేపల్లె: మండల కేంద్రం నుంచి పలమనేరుకు వెళ్లే మార్గంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పెద్దకంపల్లెకు చెందిన ఆసాది శ్రీనివాసులు, వెంకటరమణ ఇద్దరు బైక్‌లో ఫ్యాన్ మరమ్మతుల కోసం చౌడేపల్లెకు తీసుకొచ్చారు. అయితే ఇక్కడ వీలుకాదని మరొకచోటకు వెళ్లాలని మెకానిక్ చెప్పాడు. దీంతో వారిద్దరూ బైక్‌ను షాపునుంచి బస్టాండువైపు తిప్పుతిండగా, ఇదేమార్గంలో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. బైక్ నడుపుతున్న శ్రీనివాసులు(38) కాల్లోకి బైక్ కిక్కర్ రాడ్ చొచ్చుకుని పోయింది. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవలకోసం తిరుపతికి రెఫర్ చేశారు. ట్రాక్టర్ అతివేగంగా రావడం వలనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలు వీరే



పుంగనూరు: పుంగనూరు డిపో నుంచి ముళబాగిల్, తిరుపతి, రాయచోటి బస్సుల్లో ప్రయాణించిన వారికి లక్కీడిప్ నిర్వహించి బహుమతులు అందజేసినట్లు మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ స్థానిక అధ్యక్షుడు జయరామిరెడ్డితో కలసి ప్రయాణికులు రమణ, అబ్దుల్‌ఖాన్, శంకరప్ప, శివకుమార్, సానియా, విశ్వనాథచారి, రెడ్డెప్పకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

- పేదల ఆరోగ్యానికి భరోసా
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు: గత ప్రభుత్వం విద్య, వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే, తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రెండు రంగాలకు కూడా పెద్దపీట వేసిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వైద్య రంగాన్ని పరిపుష్టం చేసి, ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గురువారం పలమనేరులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసి ఆయన మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ప్రభుత్వాస్పత్రులను నిర్మించామని, అదే తీరులో వైద్యం కూడా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

ఊదరగొట్టే వాళ్లను నమ్మొద్దు

పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ, మేం గెలిస్తే అది చేస్తాం..ఇది చేస్తామని ఊదరగొట్టే వాళ్లను కాకుండా..చెప్పిందేమిటో చేతల్లో చూపి మేలు చేసిన వారినే జనం విశ్వసించాలని పలమనేరు ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు చెప్పే అబద్ధాలను ఎప్పటికీ నమ్మరాదన్నారు. దేశంలోనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా జగనన్న పాలన సాగుతోందన్నారు.ఈ ఐదేళ్లలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ఉన్నారని మళ్లీ ఇదే రెట్టింపు సంతోషం కావాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం 150 సార్లు బటన్ నొక్కితే మీరు వచ్చే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఫ్యాను గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కాలని కోరారు. జిల్లాలో ఇంతటి అభివృద్ధికి కారణం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డేనని చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డెప్ప పేర్కొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం.. భారీ బైక్ ర్యాలీ

పట్టణంలోని గంటావూరు ఫ్లైఓవర్ నుంచి వంద పడకల ఆస్పత్రి దాకా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. గజమాలలతో మంత్రికి నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.



మున్సిపాలిటీలో లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ డీడ్స్‌ను ఇస్తున్న మంత్రి

శ్రమిస్తే విజయం మనదే

- బూత్ కన్వీనర్లతో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు శ్రమిస్తే రాష్ట్రంతో పాటు కుప్పంలో కూడా పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం కుప్పం పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ బూత్ కన్వీనర్లకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ చేయనివిధంగా అభివృద్ధి, సంక్షేమం మన రాష్ట్రంలో జగనన్న చేసి చూపించారని, ప్రజలు దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసేందుకు వేచి ఉన్నారని పేర్కొన్నారు. కుప్పంలో విజయం సాధించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని, ఈ దిశగా బూత్ కన్వీనర్లు, స్థానిక నాయకులు ఇంటింటికీ ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు చాటిచెప్పాలన్నారు. స్థానికంగా లేని నాయకుడు కుప్పంలో నిలబడి, కనీసం ఓట్లు అడిగేందుకు రాకపోయినా టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేయాలని అర్థిస్తున్నారని అపహాస్యం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు నిత్యం ప్రజలకు అండగా నిలిచారని, .ఓటు అడిగే దమ్ము ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు , బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

ఎన్నికల ప్రచారంలో దోసె స్పెషల్!

రామకుప్పం: దుర్గక్క దోసె పోసెనే..వ్యాపారం జోరుగా సాగెనే.. అని ఆ హోటల్ ఓనరు సుబ్రమణ్యం తెగ సంబరపడిపోయాడు. ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ గురువారం రామకుప్పంలో పర్యటించారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. చంద్రబాబునాయుడు తన హయాంలో ఎన్నడూ చేయనంత అభివృద్ధిని జగనన్న ఇక్కడ చేసి చూపించారని, పారదర్శక పాలనకు ఇంతకంటే ఏం నిదర్శనం కావాలని ప్రశ్నించారు. నియోజక వర్గాన్ని పోలీసు, రెవెన్యూ డివిజన్లుగా చేశారని, కృష్ణా జలాలను కుప్పానికి తెచ్చి ఇక్కడి ప్రజలపై తనకున్న అభిమానాన్ని సీఎం చాటుకున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకోవాలని కోరారు. ఇదలా ఉంచితే, ప్రచారంలో ఆమె ఒక హోటల్ వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అంతేకాకుండా ఆమె కొంతసేపు అక్కడ వంటలక్క పాత్రలోకి మారిపోయారు. ప్లెయిన్ దోసె, మసాలాదోసె, ఆనియన్ దోసె..ఇలా తనదైన స్టైల్‌లో ఆమె చేయడంతో పార్టీ నాయకులతో పాటు అక్కడ ఉన్నవాళ్లంతా హాట్..హాట్‌గా లాగించేశారు. ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది. అక్క పుణ్యమా అని ఈరోజు వ్యాపారం బాగా జరిగిందని హోటల్ యజమాని ఖుషీ అయ్యాడు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మురళీకృష్ణ, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షులు అప్పి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు యశ్వంత్‌రెడ్డి, నేతలు తజ్‌ముల్‌బాషా, అబ్దుల్లా, పెనువేలు సింహా తదితరులు పాల్గొన్నారు.



హోటల్‌లో దోసె పోస్తున్న దుర్గ

చింతతోపులో అగ్నిప్రమాదం

- రూ.25వేల ఆస్తినష్టం

చౌడేపల్లె: మండలంలోని 29 చింతమాకులపల్లె వద్ద గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.25 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. గ్రామ సమీపంలోని ఆర్. గోకుల్‌కృష్ణ కు చెందిన చింతతోపులో గుర్తు తెలియని వ్యక్తులునిప్పు పెట్టడంతో అక్కడ టమాట పంటలకు వాడే బర్రలు (సపోర్టు కర్రలు)కు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకుని పుంగనూరు నుంచి ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని పరిశీలించారు.

భక్తిప్రపత్తులతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తులు

కుప్పం రూరల్: మండలంలో జంబుచెరువు కొట్టాలులోని మునీశ్వరస్వామి ఆలయంలో గురువారం వేదపండితులు భక్తిప్రపత్తులతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. చుట్టు పక్కల గ్రామాల మహిళలు పూర్ణకుంభాలతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించినట్టు గ్రామస్తులు చెప్పారు.

వేలంలో రూ.9.31 లక్షల ఆదాయం

రొంపిచెర్ల: వేలం పాటలలో రొంపిచెర్ల పంచాయతీకి రూ.9.31 లక్షల ఆదాయం వచ్చిందని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మార్కెట్ల వేలం నిర్వహించారు. వారపు సంత రూ.6.32 లక్షలు, దినసరి మార్కెట్ రూ.1.50 లక్షలు, ప్రైవేటు బస్టాండ్ రూ.1.49 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. గత ఏడాది వేలంలో రూ.8.85 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.45.500 ఆదాయం పెరిగిందన్నారు. వేలం పాటదారులు వారం లోపు పూర్తి సొమ్ము చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఈఓఆర్‌డీ రాజేంద్ర, కార్యదర్శి నాగరాజ, వార్డు సభ్యులు చిన్న నాగరాజ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మార్కెట్ల వేలం నిర్వహిస్తున్న డీపీఓ లక్ష్మి

పోలీస్‌స్టేషన్ చేరిన పది ప్రశ్న పత్రాలు

రొంపిచెర్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశ్న పత్రాలు రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌కు గురువారం చేరాయి. ఈ నెల 14 నుంచి జరగనున్న పది పరీక్షలకు రెండు సెట్ల పేపర్లను పోలీస్ స్టేషన్‌లోఎస్ఐ కృష్ణయ్య, పులిచెర్ల ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, డిపార్టుమెంట్ అధికారుల సమక్షంలో సీసీ కెమెరాలు ఉన్న రూంలో భద్రపరిచారు. మండలంలో రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన 270 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



పలమనేరు: మహిళా దినోత్సవంలో సీనియర్ జడ్జి శ్రీనివాసరావు



పలమనేరు: సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులు

పలమనేరు: పట్టణంలోని పలు చోట్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ముందస్తుగా నిర్వహించారు. స్థానిక సబ్‌కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందన్నారు. స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలన్నారు. అనంతరం పలువురు మహిళలకు బహుమతులను అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఇదే కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడారు. సీనియర్ అధ్యాపకురాళ్లను సన్మానించారు. అలాగే స్థానిక లయన్స్ సేవా కేంద్రంలో ఎస్టీయూ టీచర్స్ అసోసియేషన్ పలువురు మహిళా టీచర్లను సన్మానించింది.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రత్న గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ రత్నారెడ్డి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో సతాచాటాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సుధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో మహిళా దినోత్సవం

బైరెడ్డిపల్లె: స్థానిక మండల వనరుల కేంద్రం కార్యాలయంలో గురువారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ సాయిలీలను ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం పురుషులకు దీటుగా మహిళలు అన్నింటా రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రమణ్యం, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఉపాధ్యాయినులను సత్కరించారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్టీయూ ప్రతినిధులు మోహన్, కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, సమాజాభివృద్ధికి మహిళలు, ఉపాధ్యాయులు ఎంతో అవసరమని కొనియాడారు.







గంగవరం: సమావేశంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి, బైరెడ్డిపల్లె: ఎంఈఓ సాయిలీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, పుంగనూరులో..

ఆశీర్వదిస్తే సేవలు విస్తృతం



కల్లుపల్లెలో సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ''రాష్ట్ర ప్రజల చల్లని దీవెనలతోనే అధికారంలోకి వచ్చాం.. ఈ ఐదేళ్ల జగనన్న పాలనలో వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే సేవలు మరింత విస్తృతం చేసేందుకు సిద్ధం ఉన్నాం'' అని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలో రూ 2.71 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలను ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు.

ప్రజలే న్యాయ నిర్ణేతలు

గత ప్రభుత్వ పాలన, ప్రస్తుతం జగనన్న పాలనకు ఉన్న తేడా ఏమిటో ప్రజలే బేరీజు వేసుకుని ఎవరు మేలు చేశారో తెలుసుకోగలరని ఎమ్మెల్యే అన్నారు. ఈ ఐదేళ్లలో ఎంత గొప్పగా జగనన్న పరిపాలన చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని పథకాలు, వాటి రూపేణా మంజూరు చేసిన కోట్లాది రూపాయల గురించి, సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎందుకు అమలు చేయలేదో నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం వస్తే సచివాలయ వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తామంటున్న చంద్రబాబును ఎంచుకుంటారో? ప్రజల సేవకే జీవితాన్ని అంకితం చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ఎంచుకుంటారో? ప్రజలే న్యాయ నిర్ణేతలుగా నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ పార్వతి, వైస్ ఎంపీపీ ఉమాదేవి, ఎంపీటీసీలు భారతి, శ్రీధర్, జయచంద్ర, సర్పంచ్ బీరుగౌడు, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, గోపిక్రిష్ణ, రెడ్డెప్పరెడ్డి, వేణురెడ్డి, నల్లపరెడ్డి, వినోద్‌రెడ్డి, పవన్‌కుమార్, ఆనంద, మంజునాథ్, రెడ్డిప్రసాద్, శివన్న, బాబు, రెడ్డెప్ప, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలగటూరులో నిర్మించిన నూతన సచివాలయం

ఎమ్మెల్యే ప్రారంభించిన పనులు

మల్లేరులో రూ.11.01 లక్షలతో సీసీ రోడ్లు, కలగటూరులో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80లక్షలతో ఆర్‌బీకే భవనం, రూ 9 లక్షలతో సీసీ డ్రైన్లు, కల్లుపల్లెలో రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.19.07 లక్షలతో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.3.90 లక్షలతో సీసీ డ్రైన్లు, మేలుమాయిలో రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే భవనం, గంగవరం-3 డ్రైవర్స్ కాలనీలో రూ 20 లక్షలతో సీసీ రోడ్లు, మారేడుపల్లెలో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, దండపల్లెలో రూ. 21.80 లక్షలతో ఆర్‌బీకే భవనం, జీడిమాకులపల్లెలో రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్.

శివాలయాలు ముస్తాబు



నెక్కుంది వద్ద ఉన్న శ్రీఅగస్తీశ్వరాలయం

పుంగనూరు: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని నెక్కుంది కొండపై ఉన్న శ్రీఅగస్తీశ్వరాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని శ్రీకాశివిశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయం, శ్రీసోమేశ్వరాలయం, సోమల మండలం దుర్గంకొండలోని శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమాలు చేయనున్నారు.

సదుం మండలంలో..

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె నాగమల్లేశ్వర స్వామి ఆలయం, సదుం అరుణాచలేశ్వర, వీరభద్ర, సుబ్రమణ్యస్వామి ఆలయంలోని మరకతేశ్వర స్వామి, సీతమ్మగుట్టపై శివాలయం, నడిగడ్డ మల్లీశ్వరస్వామి, జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి, పుట్టావారిపల్లె మల్లికార్జునస్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఇక, ఎర్రాతివారిపల్లె కన్నెమూల గణపతి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

పుంగనూరు: మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ శివక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని నెక్కుంది వద్ద ఉన్న శ్రీఅగస్తీశ్వరాలయానికి, అలాగే చౌడేపల్లె నుంచి అగస్తీశ్వరాలయానికి బస్సులు, సోమల మండలంలోని దుర్గంకొండకు పుంగనూరు నుంచి బస్సులు నడుపుతామన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధం

పెద్దపంజాణి: మండలంలో రాయలపేటలోని బసవేశ్వరస్వామి ఆలయం, కోగిలేరు గ్రామ సమీపంలోని జలకంఠేశ్వరస్వామి ఆలయం, వీరప్పల్లె గ్రామ సమీపంలోని యోగనందీశ్వరస్వామి ఆలయం, బొమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆలయాలను చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు శివాలయాలు శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. కల్లూరులోని చంద్రమౌళేశ్వర స్వామి, జాండ్రపేటలోని మల్లీశ్వరస్వామి, కొమ్మిరెడ్డిగారిపల్లెలోని మల్లింకొండ ఆలయాలు ముస్తాబు చేశారు.

తాగునీటి సమస్యలపై దృష్టి

బైరెడ్డిపల్లె: వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. ఆల్లపల్లె, చిక్కనపల్లె, కంభంపల్లె, ధర్మపురి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, అధికారులు, సర్పంచులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బోరు మోటార్లు మరమ్మతులకు గురైతే ఎప్పటికప్పుడు రిపేరు చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. వలంటీర్లు ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు పంపిణీ చేస్తున్న సమయంలో సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో పర్యటించాలని, ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు రాజేష్, రాజేంద్ర బాలాజి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

ఆర్థికంగా ఎదిగితే కుటుంబం బాగు

వి.కోట: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం బాగుంటుందని సచివాలయ కార్యదర్శి యాదవ పతి అన్నారు. గురువారం స్థానిక ప్రధాన సచివాలయంలో మేజర్ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 చొప్పున నేరుగా మహిళల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జమ చేస్తున్నట్లు చెప్పారు. ఒక్క వి.కోట పంచాయతీలో 1,186 మంది మహిళలు రూ.2.22కోట్ల లబ్ధి పొందినట్లు చెప్పారు. దీంతో ఆర్థికంగా ముందుకుపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఉపసర్పంచ్ అక్మల్, వార్డు మెంబర్ కుమార్‌రాజా, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!

గుడుపల్లె: మహాశివరాత్రి సందర్భంగా మల్లప్పకొండపై శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం గిరిజా కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ముడుపులు, మొక్కులు చెల్లించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో ఊరేగించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు